ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 16 ఏప్రిల్ 2024

డిప్యూటీ సీఎంకు ఝలక్!

సొంత మండలం దేవరాపల్లిలో 'కిలపర్తి' కుటుంబం తిరుగుబాటు

- భాస్కరరావు సతీమణి రాజేశ్వరి ఎంపీపీ పదవికి రాజీనామా
- మూడు వారాల ముందు నుంచే మంత్రితో కటీఫ్
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ముత్యాలనాయుడు పేరును ప్రకటించిన వైసీపీ అధిష్ఠానం
- మాడుగుల ఎమ్మెల్యే టికెట్ ఆశించిన కిలపర్తి
- తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకున్న డిప్యూటీ సీఎం
- అప్పటి నుంచి కిలపర్తి కుటుంబం అలక



జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడుకు రాజీనామా పత్రం అందిస్తున్న దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, పక్కన ఆమె భర్త భాస్కరరావు

దేవరాపల్లి, ఏప్రిల్ 15: సాధారణ ఎన్నికల ముందు మాడుగుల నియోజకవర్గంలో అధికార వైసీపీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, అసంతృప్తి ఒక్కసారిగా బయటపడ్డాయి. ఉప ముఖ్యమంత్రి, వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి అయిన బూడి ముత్యాలనాయుడు సొంత మండలం దేవరాపల్లి మండల పరిషత్ అధ్యక్ష పదవికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి సోమవారం రాజీనామా చేయడం తీవ్ర సంచలనం రేపింది. తన భర్త, ఉప ముఖ్యమంత్రికి కుడి భుజంగా వున్న కిలపర్తి భాస్కరరావుతోపాటు జిల్లా పరిషత్ సీఈవోను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ పరిణామం వైసీపీకి షాక్‌గా భావిస్తున్నారు.

కిలపర్తి భాస్కరరావు తండ్రి కిలపర్తి సూరి అప్పారావు నియోజకవర్గంలో కీలకనేతగా ఉండడంతోపాటు, మాడుగుల అసెంబ్లీకి గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేశారు. ఆయన మరణం తరువాత భాస్కరరావు రాజకీయాల్లోకి వచ్చారు. వైసీపీ తరఫున దేవరాపల్లి ఎంపీపీగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో గట్టి పట్టున్న ఆయన.. కొద్దికాలంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ అధిష్ఠానం తొలుత ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో బూడి ముత్యాలనాయుడుకు మాడుగుల అసెంబ్లీ టికెట్ కేటాయించింది. అయితే అనకాపల్లి నుంచి ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీకి చెందిన సీఎం రమేశ్ బరిలో దిగడంతో.. వైసీపీ పెద్దలు ఇటీవల బూడి ముత్యాలనాయుడును ఆ పార్టీ తరఫున అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో మాడుగుల ఎమ్మెల్యే టికెట్ తనకు లభిస్తుందని, ఈ మేరకు తన పేరును ఉప ముఖ్యమంత్రి సిఫారసు చేస్తారని కిలపర్తి భాస్కరరావు భావించినట్టు తెలిసింది. అయితే అనూహ్యంగా ఎమ్మెల్యే టికెట్‌ను బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనూరాధకు పార్టీ అధిష్ఠానం కేటాయించడంతో భాస్కరరావు తీవ్ర నిరాశ చెందారు. అంతకు ముందు వరకు ఉప ముఖ్యమంత్రి దేవరాపల్లి మండలంలో ఏ గ్రామంలో పర్యటించినా సరే భాస్కరరావు ఆయన వెంట తప్పకుండా వుండేవారు. కానీ మాడుగుల టికెట్‌ను అనూరాధకు కేటాయించిన నాటి నుంచి డిప్యూటీ సీఎం వెంట ఆయన కనిపించడంలేదు. పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా వుంటున్నారు. అంతేకాక డిప్యూటీ సీఎం ఫోన్ చేసినా ఎత్తడంలేదని తెలిసింది. భాస్కరరావు పార్టీ కార్యకలాపాల్లో ... మిగతా 8వ పేజీలో

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల జిల్లా పర్యటన వాయిదా

అనకాపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల జిల్లా పర్యటన వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు చోడవరం, సాయంత్రం ఐదు గంటలకు ఎలమంచిలి నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం ఉమ్మడిగా ఎన్నికల ప్రచార సభలు నిర్వహించాల్సి వుంది. కానీ పవన్‌కల్యాణ్ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ ముఖ్యనేతలకు మద్దతుగా ఎన్నికల ప్రచారానికి వెళుతున్నందున మంగళవారం జిల్లాలోని చోడవరం, ఎలమంచిలి నియోజకవర్గాల్లో పర్యటన వాయిదా పడినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పర్యటన మళ్లీ ఎప్పుడు అనేది త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నామినేషన్ల దాఖలుకు ముహూర్తాలు!

- బీజేపీ, వైసీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థులు 24న నామినేషన్లు
- 18న సుందరపు, 19న అయ్యన్న, కన్నబాబురాజు, 21న అనిత..
- అట్టహాసంగా నామినేషన్‌లు వేసేందుకు అభ్యర్థులు సన్నాహాలు
- 18 నుంచి 25 వరకు స్వీకరణ

అనకాపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మరో రెండు రోజుల్లో నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుండడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు మంచి ముహూర్తం కోసం పండితులను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రంలో నాలుగో దశలో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. దీంతో వివిధ రాజకీయ పార్టీలు.. ముఖ్యంగా టీడీపీ-జనసేన- బీజేపీ కూటమితోపాటు వైసీపీ అభ్యర్థులు నామినేషన్ల దాఖలు కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించాలని భావిస్తున్నారు. ఇదే సమయంలో తమ జాతకాలకు తగిన మంచి ముహూర్తాలు ఎప్పుడున్నాయంటూ పండితులను ఆశ్రయిస్తున్నారు. అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి కూటమి తరఫున పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఈ నెల 24వ తేదీ ఉదయం 11.30 గంటలకు నామినేషన్ దాఖలు చేయాలని ముహూర్తం పెట్టుకున్నట్టు తెలిసింది. వైసీపీ ... మిగతా 8వ పేజీలో

బస్సెక్కితే బాదుడే

వైసీపీ పాలనలో రెండుసార్లు ఆర్టీసీ చార్జీలు పెంపు

- 25 నుంచి 50 శాతం మేర వడ్డించిన సర్కారు
- పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం
- ఉమ్మడి జిల్లాలోని ప్రయాణికులపై నెలకు రూ.పది కోట్లు అదనపు భారం
- ఆక్యుపెన్సీ రేషియో తగ్గిందనే నెపంతో పలు ప్రాంతాలకు సర్వీసులు రద్దు
- వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పేద, మధ్య తరగతి ప్రజల చైతన్యరథంగా పేరొందిన ఆర్టీసీ(పీటీడీ) బస్సుల్లో ప్రయాణం భారంగా మారింది. వైసీపీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో రెండుసార్లు భారీగా టికెట్ చార్జీలను పెంచడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రయాణికులపై నెలకు సుమారు రూ.10 కోట్లు అదనపు భారం పడింది. 2019లో పోల్చితే సిటీ బస్సుల నుంచి లగ్జరీ ఎక్స్‌ప్రెస్‌ల వరకు బస్సు టికెట్‌ల ధరలను 25 శాతం నుంచి 50 శాతం వరకూ పెంచేయడంతో సగటు ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ రీజియన్ ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో సుమారు 1,063 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. 256 రూట్లలో ప్రతి రోజూ 3.5 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. వీటి ద్వారా ఆర్టీసీకి రోజుకు సగటున రూ.1.35 కోట్ల ఆదాయం సమకూరుతోంది. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆర్టీసీ చార్జీలను పెంచలేదు. కాగా 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీని ఆదాయ వనరుగా మార్చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రెండుసార్లు భారీగా చార్జీలను పెంచింది. దీని వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం భారంగా పరిణమించింది. ఆదాయమే పరమావధిగా జగన్ ప్రభుత్వం చార్జీలను భారీగా పెంచడంతో వారిపై అదనపు భారం పడింది. విశాఖ పరిధిలోని వివిధ రూట్లలో తిరిగే సిటీ బస్సులతో పాటు ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రూట్లలో తిరిగే ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సుల చార్జీలను 2019తో పోల్చితే 25 శాతం నుంచి గరిష్ఠంగా 50 శాతం వరకూ పెంచారు.

విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు చార్జీల వివరాలు

ప్రాంతం	2019లో	2024లో
చోడవరం	రూ.55	రూ.75
నర్సీపట్నం	రూ.105	రూ.150
విజయనగరం	రూ.60	రూ.90
పార్వతీపురం	రూ.170	రూ.220
శ్రీకాకుళం	రూ.150	రూ.175
పాలకొండ	రూ.150	రూ.185
అనకాపల్లి	రూ.50	రూ.60
సబ్బవరం	రూ.30	రూ.40
కొత్తవలస	రూ.25	రూ.35
ఎలమంచిలి	రూ.60	రూ.85

ప్రయాణికులపై భారం ఇలా...

విశాఖ ద్వారకాబస్‌స్టేషన్ నుంచి చోడవరం ప్రయాణానికి 2019లో చార్జీ రూ.55 ఉండగా ఇప్పుడు రూ.75, నర్సీపట్నానికి 2019లో రూ.105 ఉండగా ప్రస్తుతం రూ.150, విజయనగరానికి 2019లో రూ.60 ఉంటే ప్రస్తుతం రూ.90, పార్వతీపురానికి రూ.170 ఉంటే ప్రస్తుతం రూ.220, శ్రీకాకుళానికి రూ.150 ఉంటే ప్రస్తుతం రూ.175, పాలకొండకి రూ.150 నుంచి రూ.185కి, అనకాపల్లికి రూ.50 నుంచి రూ.60, సబ్బవరం రూ.30 నుంచి రూ.40, కొత్తవలస రూ.25 నుంచి రూ.35, ఎలమంచిలి రూ.60 నుంచి రూ.85కి పెరిగిపోయాయి.

విశాఖ వాసులపైనా వడ్డన

విశాఖ పరిధిలో సింహాచలం వరకు 2019లో రూ.20 చార్జీ ఉండగా ప్రస్తుతం రూ.30, గాజువాకకు రూ.25 నుంచి రూ.35కి, భీమిలికి రూ.30 ఉంటే ప్రస్తుతం రూ.45 , కొమ్మాదికి రూ.20 నుంచి రూ.40, విశాఖ రైల్వేస్టేషన్ నుంచి తగరపువలస రూ.30 నుంచి రూ.45కి పెంచేశారు. దీని వల్ల ప్రయాణికులపై అదనపు భారం పడింది.

పెంపుపై సామాన్యుల ఆగ్రహం

ఆర్టీసీ బస్సు చార్జీలను ఐదేళ్లలో రెండుసార్లు ఏకంగా 50 శాతం మేరకు పెంచడంపై సామాన్యులు తీవ్ర ఆగ్రహం ... మిగతా 8వ పేజీలో

బాబోయ్ ఎండలు!



రోలుగుంటలో సోమవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న బీఎన్ రోడ్డు

- జిల్లా అంతటా భానుడి ప్రతాపం
- మాడుగులలో 42.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- ఆరు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
- సగం మండలాల్లో 40 డిగ్రీలకు పైబడి నమోదు

అనకాపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపంతో జనం విలవిలలాడుతున్నారు. రెండు మూడు రోజుల నుంచి జిల్లాలో అత్యధిక మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైబడి నమోదవుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ చుర్రుమంటున్నది. జిల్లాలో 24 మండలాలు ఉండగా... సోమవారం ఆరు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, తొమ్మిది మండలాల్లో వడగాడ్పులు వీశాయి. దాదాపు సగం మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు మించి నమోదయ్యాయి. మాడుగుల మండలంలో అత్యధికంగా 42.7 డిగ్రీలు నమోదైంది. చీడికాడ, దేవరాపల్లి, రావికమతం మండలాల్లో 42.6 డిగ్రీలు, రోలుగుంటలో 41.8, గొలుగొండలో 41.6, కోటవురట్లలో 40.8, నాతవరంలో 40.7, కె.కోటపాడులో 40.6, కశింకోట, మాకవరపాలెం, నర్సీపట్నంలో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా కేంద్ర అనకాపల్లిలో 39.1, చోడవరం 39.9, సబ్బవరం 39.7, బుచ్చెయ్యపేట 39.5 డిగ్రీలు, అత్యల్పంగా రాంబిల్లి మండలంలో 35.7 డిగ్రీలు నమోదయ్యాయి. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

పడకేసిన పనులు



గొలుగొండ మండలం ఏ.ఎల్.పురంలో మొదటి అంతస్తు శ్లాబ్ స్థాయిలో ఆగిన సచివాలయ భవన నిర్మాణం

నాలుగేళ్లయినా పూర్తికాని సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాలు

- 460 సచివాలయాలకు 342కు మాత్రమే వసతి
- రూ.140 కోట్ల బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్
- రూ.124 కోట్లు మాత్రమే చెల్లింపులు
- డిసెంబరు నుంచి కదలిక లేని పనులు
- 362 ఆర్‌బీకేలు.. 213 భవనాలు పూర్తి
- రూ.53 కోట్ల బిల్లులు అప్‌లోడ్.. రూ.12 కోట్లు పెండింగ్
- విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాలకు రూ.32 కోట్ల బిల్లులు అప్‌లోడ్
- గత డిసెంబరు వరకు రూ.17 కోట్లు మాత్రమే చెల్లింపు
- బిల్లులు రాకపోవడంతో ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆపేసిన కాంట్రాక్టర్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రభుత్వ నూతన భవన నిర్మాణాలు పడకేశాయి. చేసిన పనులకు ప్రభుత్వం నెలలు తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ముఖ్యంగా గ్రామ/ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు భవనాలు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా వున్నాయి. ఈ మూడు శాఖల భవనాలకు సంబంధించి సుమారు రూ.45 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో వున్నట్టు అధికార వర్గాల సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బిల్లుల క్లియరెన్స్‌పై కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.

పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో వైసీపీ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన గ్రామ/ వార్డు సచివాలయాల్లో చాలా వాటికి ఇంతవరకు పూర్తిస్థాయిలో సొంత గూడు సమకూరలేదు. అదే విధంగా రైతులకు అన్ని రకాల సేవలు ఒకేచోట అందుబాటులోకి తీసుకువస్తామంటూ ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల నూతన భవన నిర్మాణాల పరిస్థితి కూడా ఇదే విధంగా వుంది. ఆరోగ్య ఉప కేంద్రాల స్థానంలో ఏర్పాటు చేస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాలు చాలా వరకు అసంపూర్తిగానే వుండిపోయాయి. సుమారు నాలుగేళ్ల క్రితం భవనాలు మంజూరుకాగా.. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు నత్తనడకన సాగించారు. చాలాచోట్ల నెలల తరబడి పునాదులు, పిల్లర్ల దశలోనే



రాంబిల్లి మండలం అప్పన్నపాలెంలో నిలిచిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు

వుండిపోయాయి. భవన నిర్మాణాల జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపి, పనులు పూర్తి చేసేందుకు గడువులు విధించినా.. కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో భవన నిర్మాణ పనులు పడకేశాయి.

సచివాలయాల భవనాలు..

జిల్లాలో 460 గ్రామ/ వార్డు సచివాలయాలకు నూతన భవనాలు నిర్మించాలని 2020లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.40 లక్షలు చొప్పున కేటాయించారు. ఏడాదిలో పనులు పూర్తి చేసి భవనాలు అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ భావన. కానీ నాలుగేళ్లు దాటినప్పటికీ ఇంతవరకు 342 భవన నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. కాంట్రాక్టర్లు రూ.140 కోట్ల విలువైన పనులు పూర్తి చేసి, బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. కానీ గత ఏడాది డిసెంబరు వరకు రూ.124 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.16 కోట్ల మేర కాంట్రాక్టర్లకు అందాల్సి వుంది. బిల్లులు క్లియర్ కాకపోవడంతో ఎక్కడికక్కడ నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

రైతు భరోసా కేంద్రాలు..

జిల్లాలో 362 రైతు .. మిగతా 8వ పేజీలో

గిరి రైతు చింత!

- మాడుగుల సంతకు భారీగా చింతపండు
- కొనుగోలుదారులు లేక డీలా
- 30 కిలోలు ఉన్న కావిడి గతవారం రూ.2,400 వరకు విక్రయం
- ఈ వారం కేవలం రూ.1,200 పలకడంతో ఆవేదన

· 7లో

రక్తదాతలు కావలెను!

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో తగ్గుతున్న నిల్వలు

- ప్రతి నెలా 100కి పైగా యూనిట్ల రక్తం అవసరం
- కేంద్రంలో ప్రస్తుతం అందుబాటులో 16 యూనిట్లు!
- దాతలు ముందుకు రావాలని అధికారులు వినతి



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో బ్లడ్ సెంటర్

నర్సీపట్నం, ఏప్రిల్ 15: దాతల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో రక్తనిల్వలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం కేంద్రంలో 16 యూనిట్లు మాత్రమే రక్తం నిల్వ ఉండగా ప్రతినెలా వందకు పైగా రక్తం యూనిట్లు అవసరమవుతోంది. ఈ నేపథ్యంలో నర్సీపట్నం మునిసిపాలిటీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన దాతలు స్పందించి ప్రాణ దాతలు కావాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణి కోరుతున్నారు.

ఏజెన్సీ ముఖ ద్వారమైన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి వివిధ ప్రాంతాలకు చెందిన రోగుల తాకిడి ఉంటుంది. వీరిలో రక్తం అవసరమైన వారు ఎక్కువ మందే ఉంటారు. ఈ క్రమంలో ప్రతి నెలా సుమారు 100 యూనిట్ల రక్తం అవసరమవుతుంటుంది. ప్రస్తుతం కేంద్రంలో కేవలం 16 యూనిట్లు మాత్రమే రక్తనిల్వలు ఉండడంతో అత్యవసరమైన రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిలో ఓ పాజిటివ్ 4, బీ పాజిటివ్ 11, ఏబీ నెగెటివ్ ఒక యూనిట్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఏ పాజిటివ్, ఏబీ పాజిటివ్, ఓ నెగెటివ్, బి నెగెటివ్ , ఏ నెగెటివ్, ఏబీ పాజిటివ్ గ్రూప్ రక్తం లేదు. అత్యవసరమైన రోగుల బంధువులు డోనర్‌ని తెచ్చుకుంటే అందిస్తున్నారు. ప్రైవేటుగా కొనుగోలు చేయాలంటే ఒక్కో యూనిట్ రూ.1,100కు విక్రయిస్తున్నారు. అదీ డోనర్ నుంచి రక్తం తీసుకుని మాత్రమే అందిస్తున్నారు.

ఏరియా ఆస్పత్రిలోని గర్భిణులు, రోడ్డు ప్రమాదాలలో తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులు, రక్తహీనత గల రోగులకు, తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా .. మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

టెక్కలిపాలెంలో 138 మద్యం బాటిళ్లు స్వాధీనం



టెక్కలిపాలెంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

సబ్బవరం, ఏప్రిల్ 15: మండలంలోని టెక్కలిపాలెంలో అక్రమంగా విక్రయిస్తున్న 138 మద్యం బాటిళ్లను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్యం విక్రయిస్తున్న సమాచారం మేరకు టెక్కలిపాలెంలో దాడి చేయగా కె.దేముడుబాబు ఇంటి వద్ద మద్యం విక్రయిస్తుండగా సోమవారం సాయంత్రం 138 క్వార్టర్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. వాటి విలువ సుమారు రూ. 21,150 ఉంటుందన్నారు. విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ రమణ తెలిపారు.

ఇద్దరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అదృశ్యం



అదృశ్యమైన సాయి, దినేశ్ (ఫైల్)

చింతపల్లి, ఏప్రిల్ 15: మండలంలోని లంబసింగి గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. పాఠశాల వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. దీనికి సంబంధించి పోలీసులు సోమవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. లంబసింగి టీడబ్ల్యూ బాలుర ఆశ్రమ పాఠశాలలో చింతపల్లి మండలం బౌడ గ్రామానికి చెందిన పాంగి సాయి, గానుగుల గ్రామానికి చెందిన కిల్లో దినేశ్ ఏడో తరగతి చదువుతున్నారు. ఆ ఇద్దరు విద్యార్థులు శుక్రవారం ఉదయం తరగతులకు హాజరై, మధ్యాహ్నం భోజనం తరువాత పాఠశాల విడిచి వెళ్లిపోయారు. దీంతో పాఠశాల వార్డెన్ కొండలరావు చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధ్యాయులు, పోలీసులు విద్యార్థుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. విద్యార్థుల ఆచూకీ తెలిసిన వారు 9440904238, 9440904239 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్ఐ అరుణ్ కిరణ్ కోరారు.

పీఆర్ గెస్టు హౌస్‌లో ప్రైవేటు వాహనాలు

- అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్



పీఆర్ గెస్టు హౌస్ పోర్టుకోలో నిలిపిఉన్న ప్రైవేటు కార్లు

పాయకరావుపేట, ఏప్రిల్ 15: ప్రభుత్వ అతిథి గృహాల్లో ప్రైవేటు వాహనాలు నిలుపరాదన్న నిబంధన ఉన్నా పాయకరావుపేటలోని పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో మాత్రం అమలు కావడంలేదు. అతిథి గృహం ఆవరణలో కొంతకాలంగా ప్రైవేటు వాహనాలను నిలుపుతున్నారు. ఇక్కడే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డీఈ కార్యాలయం ఉన్నా పీఆర్ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇదిలా ఉంటే సోమవారం పాయకరావుపేట వచ్చిన జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అతిథి గృహం పోర్టికోలో వాహనాలు నిలిపి ఉండడాన్ని గమనించారు. పోర్టికోలో ప్రైవేటు వాహనాలు నిలిపి ఉండడంపై స్థానిక అధికారులపై అసహనం వ్యక్తంచేసి వెంటనే వెనక్కి వెళ్లిపోయారు. సోమవారం పట్టణంలో ఓ ప్రైవేటు విద్యా సంస్థలో పీవోలు, ఏపీవోల శిక్షణ తరగతులను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పరిశీలన అనంతరం పట్టణంలోని పీఆర్ గెస్టు హౌస్‌కి వచ్చారు. ఆ సమయంలో పలు కార్లు, వాహనాలు ఉండడంతో తీవ్ర అసహనానికి గురైన కలెక్టర్ వెంటనే వెళ్లిపోయారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆ వెంటనే గెస్టు హౌస్‌కి చేరుకున్న తహసీల్దారు సూర్యనారాయణ, ఎంపీడీఓ కె.స్వప్న, పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ అతిథి గృహం ఆవరణలో వాహనాలు వెంటనే తొలగించాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు.

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దేవరాపల్లి, ఏప్రిల్ 15: ఇక్కడి గురుకుల పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో అద్భుత ప్రతిభ చూపారు. గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో జరిగిన ఆలిండియా యూత్ అండ్ చిల్డ్రన్స్ కాంపిటీషన్, ఎగ్జిబిషన్‌లో దేవరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు పాల్గొని ఏడు బంగారు పతకాలు, ఆలిండియా బాల చిత్రకళ అవార్డును సొంతం చేసుకున్నారు. ప్రతిభ చూపిన ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులు రవి, సుశాంత్, గౌతంబాబు, హరీష్, బాలాజీ, కిరణ్, నరసయ్య, ఆకర్ష్‌లతో పాటు ఆర్ట్స్ టీచర్ అర్జునరావును ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఉల్లి శ్రీను, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

టీడీపీ సీనియర్ నాయకులను కలిసిన తాతయ్యబాబు



అయ్యన్నపాత్రుడుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట/నర్సీపట్నం, ఏప్రిల్ 15: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ ఎంపీ పప్పల చలపతిరావులను టీడీపీ అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షుడిగా నియామకమైన బత్తుల తాతయ్యబాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆయనను ఆదివారం ఈ పదవికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తాతయ్యబాబు జిల్లాలోని ముఖ్య నాయకులను కలిసి, జిల్లాలో పార్టీ బలోపేతానికి తనకు సహాయ సహకారాలు అందించాల్సిందిగా వారిని కోరారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	419
విజయనగరం	423
శ్రీకాకుళం	423

గిరి రైతు చింత!

- మాడుగుల వారపు సంతకు భారీగా కావిళ్లతో చింతపండు రాక
- కొనుగోలుదారులు లేక డీలా
- 30కిలోలు ఉన్న కావిడి గతవారం రూ.2400 వరకు విక్రయం
- ఈ వారం కేవలం రూ.1200లే పలకడంతో ఆవేదన



మాడుగుల వారపు సంతకు విక్రయానికి చింతపండును కావిళ్లతో తెచ్చిన గిరిజనులు

మాడుగుల, ఏప్రిల్ 15: సంతల్లో గత నాలుగైదు వారాలుగా మంచి ధర పలికిన చింతపండు ఈ వారం ఒక్కసారిగా తగ్గిపోయింది. దీంతో గిరిజన రైతులు డీలా పడగా, వ్యాపారులు ఉత్సాహంగా కనిపించారు. మాడుగులలో సోమవారం జరిగిన వారపు సంతకు ఏజెన్సీలోని గిరిజన గ్రామాలైన కక్కి, వంట్లమామిడి, ఈదులపాలెం, దేవాపురం, సలుగు, కందులపాలెం వంటి గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కావిడ్లతో గిరిజన రైతులు చింతపండును మోసుకు వచ్చారు. బుట్ట నాణ్యతగా ఉండడంతో గతంలో వలే మంచి ధర పలుకుతుందని ఆశించారు. తీరా సంతలో కొనుగోలుదారులు కరువయ్యారు. 30 కిలోలకు పైబడిన కావిడి చింతపండు ధర గతవారం రూ.రెండు వేల నుంచి రూ.రెండువేల నాలుగు వందల వరకు పలికింది. ఈ వారం అంతకంటే ఎక్కువ దక్కుతుందని ఆయా రైతులు భావించారు. అయితే సరకు ఎక్కువగా రావడం, కొనుగోలు చేసేవారు ఆ స్థాయిలో లేకపోవడంతో చేసేదిలేక ఈ వారం ఉదయం సంత ప్రారంభంలో ముప్పై కిలోల కావిడిని రూ.1200లకు విక్రయించారు. మరి కాస్త సమయం గడిచాక ఆ ధర రూ.వెయ్యికి పడిపోయింది దీంతో కొండకోనల నుంచి అష్టకష్టాలుపడి సంతకు తెచ్చిన చింతపండును తిరిగి వెనక్కి తీసుకు వెళ్లలేక వ్యాపారులు అడిగిన ధరకు విక్రయించి నిరాశగా ఇంటిముఖం పట్టారు.

రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించాలి

- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సత్కరించిన దాడి వీరభద్రరావు, రత్నాకర్, జయవీర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15: ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని, దీనిని అంతమొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. సోమవారం స్థానిక వీవీ రమణ రైతుభారతి హాల్‌లో దాడి వీరభద్రరావు అభిమానుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ కనీసం రహదారులు నిర్మించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అనకాపల్లి నుంచి గతంలో ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించి పెద్ద తప్పు చేశానన్నారు. భవిష్యత్తులో అటువంటి తప్పు జరగకుండా చూసుకోవాలన్నారు. అమర్‌నాథ్ హయాంలో అనకాపల్లి నియోజకవర్గంలో భారీ అవినీతి జరిగిందన్నారు. ఆర్ఈసీఎస్‌ను ఈపీడీసీఎల్‌లో విలీనం కావడానికి తానే ప్రధాన కారణమన్నారు. బోర్డులో విలీనం కావడం వల్ల ప్రతి నెలా రూ.200 కోట్లు ఆదాయం మిగులుతుందన్నారు. ఆర్ఈసీఎస్‌లో అవినీతికి పాల్పడిన వారిని వదిలేదని లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ తరుపున దాడి కుటుంబమంతా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి శాయిశక్తులా కృషి చేస్తానన్నారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీజేపీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. తాను స్థానిక వ్యక్తిని కాకపోయినప్పటికీ నియోజకవర్గంలోని సమస్యలన్నీ తనకు తెలుసునని వాటిని ఢిల్లీ స్థాయిలో వినిపించే సత్తా తనకుందన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ అనకాపల్లిలో 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో దాడి వీరభద్రరావు, తాను వేర్వేరు పార్టీల్లో ఉండి ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ మా మధ్య ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. తామిద్దరం కలవాలని ఎప్పటి నుంచో చాలా మంది కోరుకున్నప్పటికీ అది ఈరూపేణా నిజమైందన్నారు. మా కలయిక అనకాపల్లి అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ ఎంతో ఉత్తమమైన రాజకీయాలు నడిపి అనకాపల్లి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ యువ నాయకుడు దాడి జయవీర్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, సీఎం రిత్విక్, తమ్మన సుబ్బారావు, అధికసంఖ్యలో దాడి అభిమానులు పాల్గొన్నారు. అంతకుముందు టీడీపీలో ఉన్నత స్థానాలకు ఎంపికైన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, దాడి రత్నాకర్‌లను సీఎం రమేష్, కొణతాల రామకృష్ణ సత్కరించారు. అలాగే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులిద్దరినీ దాడి వీరభద్రరావు, రత్నాకర్, జయవీర్ సత్కరించారు.

ఎన్నికల శిక్షణ తరగతులు పరిశీలించిన కలెక్టర్



పాయకరావుపేటలో పీవోలు, ఏపీవోలు రూమ్‌లో లేకపోవడంతో వెళ్లిపోతున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



ఎలమంచిలిలో పీవో, ఏపీవోలకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

పీవో, ఏపీవోలు లేకపోవడంతో వెనుదిరిగిన రవి పట్టన్‌శెట్టి

పాయకరావుపేట, ఏప్రిల్ 15: ఎన్నికల సిబ్బందికి సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పరిశీలించారు. అయితే ఆయన వచ్చిన సమయానికి ఆర్వోలు, ఏఆర్వోలు భోజనం చేసేందుకు వెళ్లిపోవడంతో కలెక్టర్ వెనుతిరిగి వెళ్లిపోయారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు సోమవారం పట్టణంలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ కె.గీతాంజలి మాట్లాడుతూ నియోజకవర్గంలో పీఓలు, ఏపీఓలు కలిపి 777 మందికి ఎన్నికల నిర్వహణపై థీరీ, ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. తొలి రోజు సోమవారం 373 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. రెండో రోజు 392 మందికి శిక్షణ ఇవ్వనున్నామని ఆమె తెలిపారు. అయితే సోమవారం జరిగిన శిక్షణ తరగతులను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పాయకరావుపేట మధ్యాహ్నం 1.30 గంటలకు వచ్చారు. ఆయన నేరుగా తరగతులు నిర్వహిస్తున్న రూమ్‌కు వెళ్లారు. అయితే అప్పటికే మధ్యాహ్నం భోజన విరామ సమయం కావడంతో పీఓలు, ఏపీఓలు భోజనం చేసేందుకు వెళ్లిపోయారు. దీంతో అసంతృప్తికి గురైన కలెక్టర్ ఏమీ మాట్లాడకుండానే శిక్షణ నిర్వహణపై ఆర్‌ఓ గీతాంజలిని వివరాలు అడిగి వెంటనే వెనుతిరిగారు. శిక్షణ తరగతులు పరిశీలించేందుకు కలెక్టర్ వస్తున్నారన్న సమాచారం ఉన్నా ఆర్‌ఓ, ఏఆర్‌ఓలు ఆయన వచ్చిన సమయానికి పీఓలు, ఏపీఓలు ఉండేలా చూసుకోకపోవడం గమనార్హం.

పీవో, ఏపీవోలకు కలెక్టర్ సూచనలు

ఎలమంచిలి: పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన నిఘా ఉండాలని, భద్రతా ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి మనోరమకు సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓ, ఏపీఓలకు రెండు రోజులు పాటు నిర్వహించే శిక్షణ తరగతులను కలెక్టరు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో సిబ్బంది పాటించాల్సిన నియమ నిబంధనలపై సూచనలిచ్చారు. ఈవీఎంలు, వీవీపాట్‌లపై పూర్తి అవగాహన ఉండేలా శిక్షణలో తెలుసుకోవాలన్నారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం: ఎన్నికల నిర్వహణకు సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన పీవోలు, ఏపీవోల శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సందర్శించారు. తొలుత ఇక్కడ ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు స్వీకరణ విభాగాన్ని పరిశీలించారు. అనంతరం 333 మంది పీవోలు, ఏపీవోలకు జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గత ఎన్నికల్లో పనిచేసిన అనుభవం ఎంత మందికి ఉందని అడిగి తెలుసుకున్నారు. ట్రైనింగ్ ప్రోగ్రామ్ వీడియో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ ఆఫీసర్ హెచ్‌వీ జయరాం, తహసీల్దార్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఈడీ కార్యాలయం ముట్టడి

- తక్షణమే కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్
- ఇంటక్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన



ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఇంటక్ నాయకులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 15: ఉక్కు కర్మాగారం కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాం డ్ చేస్తూ ఇంటక్ ఆధ్వర్యంలో సోమవారం ఈడీ (వర్క్స్) కార్యాలయాన్ని ముట్టడించారు. ఉక్కు ఉద్యోగులకు ఈ నెల సగం జీతాలే చెల్లించారని, మిగతా మొత్తాన్ని తక్షణమే అందించాలంటూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కార్మికులకు సగం జీతం ఇవ్వడం దారుణమన్నారు. కార్మికుల సమస్యలపై గుర్తింపు యూనియన్ తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. సంస్థ ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అన్నీ సెయిల్ మాదిరిగానే చేపడతామన్న ఉక్కు యాజమాన్యం ఇప్పుడు నూతన వేతనాల విషయంలో మాత్రం చేతులెత్తేసి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. ఉద్యోగుల జీతాల కింద రూ.వంద కోట్లు ఇవ్వలేని స్థితిలో ప్లాంట్ లేదని, యాజమాన్యం కావాలనే తాత్సారం చేస్తుందని రాజశేఖర్ ఆరోపించారు. అనంతరం సీజీఎం (వర్క్స్) కార్యాలయాన్ని కూడా నాయకులు, కార్మికులు ముట్టడించారు. జీతాలు ఇస్తేనే ఇక్కడ నుంచి కదులుతామంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు భీష్మించుకు కూర్చున్నారు. కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సీజీఎం శ్రీధర్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు కారు రమణ, జీవీ సుబ్బయ్య, కె.అవతారం, గోపాల్‌రాజు, జి.గురుమూర్తి, ఎం.గోపి నారాయణ, పీవీ నగేష్, పోతారెడ్డి, మొల్లి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అభిమానుల సహకారం గొప్పది

- వారి వల్లనే సినీరంగంలో ఉన్నతస్థాయికి చేరాను
- ప్రముఖ సినీనటుడు సుమన్ వెల్లడి
- శివశక్తి క్షేత్రం సమీపంలో ఉచిత ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన



చిక్కుడుపాలెంలో శివశక్తిక్షేత్రం ఆలయాన్ని సందర్శించిన సినీ నటుడు సుమన్

నాతవరం, ఏప్రిల్ 15: సినీ రంగంలో తనకు ఎవరి సపోర్టు లేకుండా అభిమానుల సహకారంతోనే ఉన్నతస్థాయికి ఎదిగానని ప్రముఖ సినీనటుడు సుమన్ తెలిపారు. మండలంలోని గుమ్మిడిగొండ పంచాయతీ శివారు చిక్కుడుపాలెం తాండవ నది సమీపంలో ఉన్న శివశక్తి క్షేత్రం వద్ద ఆలయ ధర్మకర్త కేఎస్ఆర్ శర్మ ఆధ్వర్యంలో చేపట్టే 50 పడకల ఉచిత ఆస్పత్రి నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటివరకు వంద తెలుగు సినిమాలు, 25 కన్నడ సినిమాలు, ఇతర భాషల్లో 750 సినిమాల్లో తాను నటించినట్టు చెప్పారు. అన్నమయ్య చిత్రం తనకు మంచి గుర్తింపు తెచ్చిందన్నారు. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఉపవాసం చేసి ఎంతో నిష్టతో వేంకటేశ్వరస్వామి పాత్రను వేశానన్నారు. ఇక్కడి ఆలయ ప్రాధాన్యతను సినీ ప్రముఖులకు తెలియజేస్తానని వివరించారు. అనంతరం ఆయన చిక్కుడుపాలెంలోని భూగర్భ శివాలయాన్ని సందర్శించుకున్నారు. ఆలయ విశిష్టతను ధర్మకర్త శర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షుడు సతీష్, వెలగా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎండ తీవ్రత



సందడి లేని అనకాపల్లి రింగురోడ్డు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15: అనకాపల్లిలో ఎండ తీవ్రత అధికంగా ఉంది, వడగాడ్పులు కొనసాగుతున్నాయి. దీంతో పట్టణ ప్రజలే కాకుండా వివిధ పనులపై వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం అత్యధిక ఉష్ణోగ్రత 39 డిగ్రీలు నమోదైంది. అయితే సోమవారం ఈ ఉష్ణోగ్రత 37.5 డిగ్రీలకు తగ్గినా వడగాడ్పులు తగ్గకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే పలు రహదారుల్లో జనసందడి తగ్గింది. సామాన్య ప్రజలు కూడా ఇళ్లల్లోంచి ఈ ఎండకు భయపడి బయటకు వచ్చేందుకు సహసించడం లేదు.

దళితులను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం

- కూటమి ప్రభుత్వం రాగానే న్యాయం చేస్తాం
- బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ



మాట్లాడుతున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 15: దళితులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని, టీడీపీ,బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారందరికీ న్యాయం చేస్తామని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ ఇచ్చారు. సోమవారం అనకాపల్లి పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్ అధ్యక్షతన జరిగిన దళిత ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల సంక్షేమం కోసం టీడీపీ అమలు చేసిన 27 పథకాలను రద్దు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. మాస్కులు లేవని ప్రశ్నించిన ఒక డాక్టర్‌ను పిచ్చివాడు అనే ముద్ర వేసి చంపిన దుర్మార్గపు ప్రభుత్వం వైసీపీ అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలంతా ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకాన్ని రద్దు చేయడం ద్వారా అనేక మంది యువత ఉన్నత విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు కమలం గుర్తుపై, అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకష్ణకు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కోట్ని బాలాజీ, దూలం గోపీ, పావాడ కామరాజు, కోన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా బెంగళూరు, గువాహటి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఏప్రిల్ 15: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా బెంగళూరు, గువాహటి మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06521 నంబరు గల రైలు ఈనెల 16 నుంచి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 11.40 గంటలకు బెంగళూరులో బయలుదేరి మర్నాడు సాయంత్రం 6.18 గంటలకు దువ్వాడ, శుక్రవారం ఉదయం 4.50 గంటలకు గువాహటి చేరుతుంది. తిరిగి రైలు ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 6.15 గంటలకు గువాహటిలో బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 3.08 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 10.55 గంటలకు బెంగళూరు చేరుతుంది.

ఉపాధి హామీ కూలీలతో సీఎం రమేశ్ సతీమణి సమావేశం


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి

కశింకోట, ఏప్రిల్ 15 : మండలంలోని ఉగ్గినపాలెం, అడ్డాం, సింగవరం, భీమవరం, సుందరయ్యపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో సోమవారం అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సతీమణి సీఎం శ్రీదేవి, సోదరి విజయ లక్ష్మి,కుటుంబ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను గెలిపించినట్టయితే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చేస్తారన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. వైసీపీ పాలనలో ఉపాధి కూలీలు ఎదుర్కొన్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వారి వెంట బీజేపీ అనకాపల్లి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి పొన్నగంటి అప్పారావు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అప్పికొండ అప్పారావు, నానిబాబు, విజయ్, సత్తిబాబు, రెడ్డి సూరి బాబు, బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పప్పల సమక్షంలో టీడీపీలో చేరిన రేబాక

రాంబిల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని వెల్చూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు రేబాక ఆనందరావు తన అనుచరులతో కలిసి సోమవారం టీడీపీలో చేరారు. వారందరికీ మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని ప్రజలకు అంతా మేలే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు దిన్‌బాబు, డి.రంగనాయకులు, డీఎస్ఎన్ రాజు,గొల్లగాని వెంకటరావు, ముత్యాలు శ్రీను, వాతాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంచదార్ల వినాయకుడిని దర్శించిన సచ్చితానంద సరస్వతి


మాట్లాడుతున్న సచ్చితానంద సరస్వతి

రాంబిల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని పంచదార్ల కల్యాణ వినాయకుడిని సోమవారం తుని తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చితానంద సరస్వతి దర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి, పంటలు సమృద్ధిగా ఉండాలని ప్రతి గ్రామానికి రెండు పూజ కలశాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీటీ సెంట్రల్ కో-ఆర్డినేటర్ సీతారామరాజు, గురుకుల హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో రైతాంగం కుదేలు

» జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ


తుమ్మపాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, ఏప్రిల్ 15 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనతో రాష్ట్రంలో రైతాంగం కుదేలైందని జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. సోమవారం తుమ్మపాలలో ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతాంగానికి అండగా ఉండేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన వారందరికీ మళ్ళీ సంక్షేమ పథకాలు అందిస్తామని, శతశాతం అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉపాధి హామీ కూలీలకు లబ్ధి చేకూరేలా పథకాన్ని మరింత విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఉమ్మడి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాయకరావుపేట, ఏప్రిల్ 15 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగుతుందని ఎంపీడీఓ కె.స్వప్న తెలిపారు. ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అందరు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

'పేట' కాంగ్రెస్ టికెట్ స్థానికులకే కేటాయించాలి

పాయకరావుపేట, ఏప్రిల్ 15 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాయకరావుపేట కాంగ్రెస్ పార్టీ టికెట్ స్థానికులకు ఇవ్వాలని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మారుతి నారాయణ చక్రవర్తి, భూర్తి ఏసు, గారా సూర్యనారాయణ, మోర్త సింహాచలం తదితరులు మాట్లాడారు. తామంతా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషిచేశామన్నారు. అటువంటిది తమను కాదని వచ్చే ఎన్నికల్లో స్థానికేతరుడు, ఇతర పార్టీకి చెందిన బోని తాతారావుకు పార్టీ టికెట్ కేటాయించడం సరికాదన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం టికెట్ కేటాయింపులో పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 104 మంది ఎంపిక


క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట, ఏప్రిల్ 15 : స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో సోమవారం వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 104 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కార్పొరేట్ సంస్థ డేటా ప్రో ఆధ్వర్యంలో డిఫైన్ ప్రో, రెండ్వుడ్, నవత, అపోలో, ముత్తూట్ కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయన్నారు. ఈ ఇంటర్వ్యూల్లో 200 మంది పాల్గొనగా.. 104 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డేటా ప్రో సంస్థ హెచ్‌ఆర్ సి.తేజ, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు డేవిడ్ సురేందర్, ఎస్.సుధీర్, డి.వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

327 గ్రామ వలంటీర్లు రాజీనామా

కోటవురట్ల, ఏప్రిల్ 15: మండలంలో 14 గ్రామ సచివాలయాలకు చెందిన 327 మంది వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేసినట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథం తెలిపారు. సోమవారం పాములవాక గ్రామ సచివాలయంలో వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 19 మంది వలంటీర్లు గ్రామపంచాయతీ కార్యదర్శి స్వామినాయుడుకు రాజీనామా పత్రాలు అందజేశారు. సుంకపూర్‌లో 19మంది, చౌడువాడ, టీకేపల్లి, తంగేడు, బోడపాలెం, కేవెంకటాపురం, పీకేపల్లి, చినబొడ్డేపల్లి, కోటవురట్ల-1, కోటవురట్ల తదితర గ్రామాల వలంటీర్లు రాజీనామాలు చేశారన్నారు.

భానుడి భగభగలు


కోటవురట్లలో మెయిన్ రోడ్డుపై తగ్గిన రాకపోకలు

కోటవురట్ల, ఏప్రిల్ 15: భానుడు ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచి వడగాడ్పులు వీయడంతో ఇళ్లలోంచి బయటకు రావడానికి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఉష్ణోగ్రత 37.3 నమోదైంది. దీంతో వడగాడ్పులు వీయడంతో వృద్ధులు, పిల్లలు అపసోపాలు పడుతున్నారు. ఐదు రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పాదచారులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. వేడిగాడ్పులు వీస్తుండడంతో మధ్యాహ్నం రహదారులు జనసంచారం లేక బోసిపోతున్నాయి.

వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రం అధోగతి

జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్


కొత్తపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సుందరపు విజయకుమార్

రాంబిల్లి, ఏప్రిల్ 15: ఐదేళ్ల అరాచక పాలనలో రాష్ట్రాన్ని వైసీపీ అధోగతి పాలు చేసిందని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట గ్రామా ల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని ఓటర్లను కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తోనే రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి సాధిస్తుందన్నారు. తనకు గాజుగ్లాస్‌పైన, ఎంపీ సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సుందరపు కోరారు. సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, డీఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన కాకరాపల్లి సర్పంచ్

మునగపాక మండలం కాకరాపల్లి సర్పంచ్ కొల్లి మునిలయ్య తన అనుచరులతో కలిసి ఆదివారం హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో చేరారు. వారికి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తనకు గాజుగ్లాస్, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి, ఆడారి కృష్ణ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదయాతపాలెంలో లాలం భవాని ప్రచారం

రాంబిల్లి, ఏప్రిల్ 15: లాలంకోడూరు శివారు పెదయాతపాలెంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, జనసేన నాయకుడు లాలం చందు, మాజీ సర్పంచులు లాలం సత్యప్రసాద్, లాలం రమేష్‌నాయుడు, అభిరామ్ కూటమి అభ్యర్థులు సుందరపు విజయకుమార్, సీఎం రమేశ్‌లను గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అంతా మేలే జరుగుతుందన్నారు. అలాగే మండలంలోని హరిపురంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి ప్రచారం చేస్తూ, కూటమి అభ్యర్థులు విజయకుమార్, సీఎం రమేశ్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల స్థలంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు


ఆక్రమణదారులను ప్రశ్నిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి

సబ్బవరం, ఏప్రిల్ 15 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, తక్షణమే అడ్డుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి సోమవారం స్థానిక తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాల ఏర్పాటుకు 2010 జనవరి 27వ తేదీన రెవెన్యూ అధికారులు సబ్బవరం సర్వే నంబరు 255/2లో ఐదు ఎకరాలు అప్పటి ప్రిన్సిపాల్‌కు అప్పగించారన్నారు. అప్పటి నుంచి ఆ స్థలం తమ ఆధీనంలో ఉందన్నారు. ఇటీవల డిజిటల్ సర్వే చేసి కళాశాల సరిహద్దు చుట్టూ ఐదు ఎకరాల స్థలానికి కందకాలు తవ్వడం జరిగిందన్నారు. అయితే ఆదివారం సెలవు రోజున కొంతమంది ప్రైవేటు వ్యక్తులు డిగ్రీ కళాశాల వాయువ్యప్రాంతం (ప్రైవేటు లే-అవుట్‌కు ఆనుకొని)లో యంత్రాలతచదును చేసి నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. సోమవారం పనులు అడ్డుకోవడం జరిగిందన్నారు. తదుపరి నిర్మాణాలు జరగకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు రక్షణ కల్పించాలని ప్రిన్సిపాల్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన


అనకాపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న అగ్నిమాపక అధికారులు ,సిబ్బంది

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్‌వీ రమణ ఆధ్వర్యంలో ఫైర్ ఆఫీసర్ బి. నరసింగరావు, సిబ్బంది వాహనాలతో కార్యాలయం నుంచి రింగురోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రింగురోడ్డు జంక్షన్‌లో నీటితో డెమో నిర్వహించారు. అలాగే మురికివాడల్లో అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్

ఎలమంచిలి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం అగ్నిమాపక సిబ్బంది ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదాల పట్ల అజాగ్రత్త వహించకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యాపారులకు సూచించారు. ప్రమాదాలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సెక్కితే బాదుడే

... 5వ పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నారు. కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, స్వయంసహాయక వృత్తుల్లో ఉన్నవారంతా అద్దెలు తక్కువగా ఉంటాయనే భావనతో విశాఖ శివారు ప్రాంతాల్లో నివసిస్తారు. వారంతా పనుల కోసం విశాఖ నగరానికి నిత్యం బస్సుల్లోనే వచ్చిపోతుంటారు. వచ్చే కూలి/ వేతనంలో చార్జీలకే ఎక్కువ మొత్తం కేటాయించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉందనే కారణంతో పలు రూట్లలో బస్సులను రద్దుచేస్తున్నారని, దీనివల్ల ఆటోలే శరణ్యమవుతున్నాయంటున్నారు. ఆర్టీసీ చార్జీలను పెంచి ఆదాయం సమకూర్చుకోవాలనే వైసీపీ సర్కారు తీరును వారంతా తూర్పారబడుతున్నారు.

నామినేషన్ల దాఖలుకు ముహూర్తాలు!

... 5వ పేజీ తరువాయి

ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలు నాయుడు కూడా అదే రోజున (24వ తేదీ) నామినేషన్ వేసేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్టు సమాచారం. నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈనెల 19న, ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ 18న, వైసీపీ అభ్యర్థి రమణమూర్తిరాజు 19న నామినేషన్‌లు వేయనున్నారు. పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత 21వ తేదీన నామినేషన్ వేసి, 23న భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నామినేషన్‌ల స్వీకరణకు ఈనెల 25వ తేదీ వరకు గడువు వుంది.

డిప్యూటీ సీఎంకు ఝలక్!

... 5వ పేజీ తరువాయి

చురుగ్గా పాల్గొనేలా డిప్యూటీ సీఎం ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆయన నుంచి స్పందన లేనట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కిలపర్తి భాస్కరరావు వ్యవహారంపై ఆదివారం రాత్రి మండలానికి చెందిన పార్టీ ముఖ్యనేతలతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించినట్టు సమాచారం. భాస్కరరావును బుజ్జగించే ప్రసక్తే లేదని, అతనికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ తనను మోసగించారంటూ డిప్యూటీ సీఎం వ్యాఖ్యలు చేసినట్టు చెబుతున్నారు. అతనితో తెగతెంపులు చేసుకున్నట్టు స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న కిలపర్తి భాస్కరరావు, తన భార్య రాజేశ్వరిని వెంటబెట్టుకుని సోమవారం మధ్యాహ్నం విశాఖపట్నం వెళ్లి జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడును కలిశారు. రాజేశ్వరి ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తూ, లేఖను ఆయనకు అందజేశారు. ఆరోగ్యం సహకరించక పోవడంతో ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. కాగా ఎంపీటీసీ పదవికి, వైసీపీకి రాజీనామా చేయలేదని భాస్కరరావు, రాజేశ్వరి చెప్పారు.

పడకేసిన పనులు

... 5వ పేజీ తరువాయి

భరోసా కేంద్రాలకు భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రతి భవన నిర్మాణానికి రూ.21.8 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 213 భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఇంకా 149 భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కాంట్రాక్టర్లు రూ.53 కోట్ల మేర బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఇంతవరకు రూ.41 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. రూ.12 కోట్లు విడుదల కాకపోవడంతో ఈ ఏడాది జనవరి నుంచి పనులు నిలిచిపోయాయి.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు...

జిల్లాలో 297 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకుగాను 143 క్లినిక్‌ల భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో 154 భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.20.89 లక్షలు అంచనా వ్యయం అవుతుందని నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు రూ.32 కోట్ల మేర బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. గత ఏడాది డిసెంబరు వరకు రూ.17 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.15 కోట్ల మేర బిల్లులు నిలిచిపోయాయి. నిధులు ఎప్పుడు విడుదల అవుతాయన్న దానిపై అధికారులకు కూడా స్పష్టత లేదు. పనులు పర్యవేక్షించిన సంబంధిత పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు ఎన్నికల విధుల్లో ఉండడంతో భవన నిర్మాణ పనుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాగా జిల్లాలో ప్రభుత్వ శాఖల భవన నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంపై పంచాయతీరాజ్ శాఖ ఈఈ వీరన్నాయుడును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఎన్నికల షెడ్యూల్ కారణంగా నిర్మాణ పనులు ఆగిన మాట వాస్తవమేనన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఎం.బుక్ ప్రకారం సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశామని చెప్పారు. ఒకింత ఆలస్యం అయినప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు జరుగుతాయని ఆయన తెలిపారు.

మాజీ మంత్రి బండారుతో సీఎం రమేశ్ భేటీ

పరవాడ, ఏప్రిల్ 15 : టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తితో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోమవారం రాత్రి వెన్నెలపాలెంలో భేటీ అయ్యారు. సుమారు గంట పాటు ఇరువురు మాట్లాడుకున్నారు. భేటీ అనంతరం బయటకు వచ్చిన సీఎం రమేశ్ అక్కడున్న స్థానిక టీడీపీ నాయకులతో మాట్లాడారు. బండారుకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. అప్పటికే బండారు నివాసం వద్ద ఉన్న టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు సీఎం రమేశ్‌తో కలిసి ఫొటోలు దిగారు. అలాగే మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు కూడా బండారు సత్యనారాయణమూర్తితో భేటీ అయ్యారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐ

ఎస్.రాయవరం, ఏప్రిల్ 15: మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురం వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ఎన్నికలకు సంబంధించి నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ అప్పన్న మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిబంధనల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారిపై రాకపోకలు చేస్తున్న అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

డీఎస్పీ సమక్షంలో పీఎస్ కమిటీ ఏర్పాటు

కశింకోట, ఏప్రిల్ 15: మండలంలోని పరవాడపాలెంలో యువకులు తరచూ గొడవలకు పాల్పడుతున్న నేపథ్యంలో అనకాపల్లి డీఎస్పీ ఎస్. అప్పలరాజు ఆధ్వర్యంలో పీఎస్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు సీఐ వినోద్‌బాబు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలందరితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఎలాంటి గొడవలు జరగకుండా పీఎస్ కమిటీ చూడాలన్నారు. ముఖ్యంగా గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి మద్యం, నగదు, బహుమతులు పంపిణీల్లో పాల్గొకూడదన్నారు. అనంతరం గ్రామ ప్రజలందరి సమక్షంలో పీఎస్ కమిటీ సభ్యులు సంతకాలు చేసి హామీ పత్రాన్ని డీఎస్పీకి అందజేశారు.

ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

పరవాడ, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబును, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వాడచీపురుపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో కాపీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 15: మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సోమవారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి వైసీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, వైసీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి పాల్గొన్నారు.

రక్తదాతలు కావలెను!

... 5వ పేజీ తరువాయి

రోగులకు రక్తం అందిస్తున్నారు. గత ఏడాది 908 మందికి రక్తం అందించగా ఈ ఏడాది జనవరిలో 106, ఫిబ్రవరిలో 100, మార్చిలో 84 మందికి రక్తం సరఫరా చేసి ప్రాణాలను కాపాడారు.

వేసవి, ఎన్నికల ఎఫెక్ట్

ఏటా ఏప్రిల్, మే నెలల్లో రక్తం కొరత ఏర్పడుతుంది. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోవడంతో దాతల కొరత నెలకొంటోంది. ఈ ఏడాది ఎన్నికల హడావిడి కావడంతో రాజకీయ నాయకులు బ్లడ్‌క్యాంప్‌లు ఏర్పాటు చేయడం లేదు. ఎన్నికల ప్రచారంలో ఉండిపోవడంతో సాధారణ రక్తదాతలు ముందుకు రావడం లేదు. దీంతో ఏరియా ఆస్పత్రిలోని కేంద్రంలో రక్త నిల్వలు తరిగిపోతున్నాయి. స్వచ్ఛంద సేవా సంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం కొరతను తీర్చాలని సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి దేవి కోరుతున్నారు.

బీజేపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం

» ఏఐసీసీ పరిశీలకుడు మనోజ్‌చౌహాన్


కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చౌహాన్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15 : గత పదేళ్ల బీజేపీ ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఏఐసీసీ పరిశీలకుడు మనోజ్‌చౌహాన్ అన్నారు. సోమవారం అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని అన్ని వ్యవస్థలను మోదీ తన గుప్పెట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్న ప్రధాన అజెండాతో ఇండియా కూటమి ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అనకాపల్లి ఎమ్మెల్యే ఐఆర్ గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రజా ఆమోదం గల మేనిఫెస్టోను కాంగ్రెస్‌పార్టీ విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం కాంగ్రెస్ అభ్యర్థి రుత్తల శ్రీరామ్మూర్తి, పాయకరావుపేట అభ్యర్థి బోని తాతారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివయ్య కల్యాణ రాటోత్సవం


ఉపమాక శివాలయంలో పెళ్లి రాట వేసిన దృశ్యం

నక్కపల్లి, ఏప్రిల్ 15: మండలంలోని ఉపమాక శివాలయంలో శివ,పార్వతుల వార్షిక కల్యాణోత్సవాలకు సోమవారం రాటోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు వెలవలపల్లి మహేశ్, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు శైవాగమం ప్రకారం స్వామివారి కల్యాణోత్సవాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో కొప్పిశెట్టి కొండబాబు, సిద్దాబత్తుల కృష్ణ, యువీఎస్ రావు, మీగడ ఈశ్వరరావు, సింగరాచార్యులు, సింగంశెట్టి నానీ పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక


పార్టీలోకి చేరిన వారికి కండువాలు వేస్తున్న వంగలపూడి అనిత

నక్కపల్లి, ఏప్రిల్ 15: మండలంలోని రాజయ్యపేటకు చెందిన పలువురు యువకులు, మహిళలు సోమవారం టీడీపీలో చేరారు. వారందరికీ టీడీపీ అభ్యర్థి అనిత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ ప్రాధాన్యత వుంటుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, కొప్పిశెట్టి కొండబాబు, శ్రీను, మత్స్యకార నాయకులు పిక్కి శ్రీనివాసరావు, పిక్కి సత్తియ్య, నాగరాజు పాల్గొన్నారు.

వెంకటాపురంలో ఘనంగా రామాలయం ప్రారంభం


భక్తుల పూజలందుకున్న సీతారాములు

రాంబిల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని వెంకటాపురంలో రామాలయాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ, వినాయక స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ చేశారు. వేదపండితులు పూజలు, హోమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎలమంచిలి ఎమ్మెల్యే యూవీ.రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, జడ్పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, స్థలదాత, ధర్మకర్త రోమాల మూలరాజు దంపతులు, సర్పంచ్ కిల్లాడి తాతబ్బాయి, భక్తులు సీతారాములవారిని దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, ఏప్రిల్ 15: ఎస్.రాయవరం మండలం దార్లపూడి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కొత్తలి, ఏటికొప్పాక రెండు ఫీడర్ల లైన్ నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కొత్తలి, పేరంటాలపాలెం, ములకలాపల్లి, మన్యంపాలెం, ఏటికొప్పాక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వ్యవసాయ కనెక్షన్‌లకు ప్రత్యామ్నాయంగా సరఫరా చేస్తామన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై అన్ని పార్టీలు వైఖరి చెప్పాలి

» ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు

తుమ్మపాల, ఏప్రిల్ 15 : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వంత పాడుతూ అనుకూలంగా వ్యవహరిస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు స్పష్టం చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఖరి, ప్రతిపక్ష పార్టీల నాయకుల వైఖరిని వెల్లడించాలన్నారు. నాడు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు పోరాటాలు చేస్తున్న సమయంలో పెదవి విప్పని నాయకులు నేడు స్టీల్‌ప్లాంట్‌పై హామీలు గుప్పించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటకోట సత్యనారాయణ, రుత్తల శంకరరావు, సీహెచ్.రాంబాబు, సాయిలక్ష్మణ్, కె.త్రినాథ్, కోన లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా లలితాంబిక అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం, ఏప్రిల్ 15 : మండలంలోని దేవీపురంలో లలితాంబిక అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పంచదశి మంత్రజపం, అభిషేకం, శోడషోపచార పూజ, లలితా హోమం, కళావాహన, లలితా సహస్రనామవళి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది.

సీతారాముల ఆలయంలో ఘనంగా గోరింట ఉత్సవం

ఎలమంచిలి, ఏప్రిల్ 15: పట్టణంలోని కొత్తపేట సీతారాముల ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం గోరింట ఉత్సవాన్ని సంప్రదాయ రీతిలో జరుపుకున్నారు. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో మహిళలు, బాలికలు పాల్గొన్నారు. ఉత్సాహంతో మహిళలు తమ చేతులకు గోరింట పూసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పిల్లా త్రినాథ్, పిల్లా కనకమణి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముని పెళ్లి రాట

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 15 : స్థానిక మెయిన్‌రోడ్డులోని చిన బజార్ వద్ద గల సీతారాముల ఆలయంలో సోమవారం శ్రీరాముని పెళ్లిరాటను ఘనంగా నిర్వహించారు. ఈనెల 17న ఆరుబయట శ్రీరామనవమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కొణతాల జగన్నాథరావునాయుడు, కె.నారాయణరావు, సిరసపల్లి సూరిబాబు, వెంకటేశ్వరరావు, కామధేను ప్రసాద్, సిరసపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

మరిడి మహాలక్ష్మి పండగ ప్రారంభం

▸ అత్యంత భక్తిశ్రద్ధలతో నర్సీపట్నంలో మొదటి జాగరణ

▸ గరగల ఊరేగింపులో పాల్గొన్న మాజీ మంత్రి అయ్యన్న కుటుంబం



గరగలకు పూజలు చేస్తున్న అయ్యన్న కుటుంబ సభ్యులు

నర్సీపట్నం, ఏప్రిల్ 15 : పట్టణంలో మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగ సోమవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా మొదటి జాగరణను ఘనంగా నిర్వహించారు. ఈనెల 23 తేదీన అమ్మవారి పండగ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్సీ కాలనీ నుంచి అమ్మవారి గరగలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఇంటికి తీసుకువచ్చారు. అయ్యన్న కుటుంబ సభ్యులు గరగలకు పూజలు చేసి ధూపం వేశారు. అయ్యన్న సతీమణి పద్మావతి, కోడళ్లు డాక్టర్ సువర్ణ, దివ్య గరగలు తలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. పట్టణంలో రాత్రంతా గరగల ఊరేగింపు వందల మంది భక్తులతో ఘనంగా సాగింది. ఈ సందర్భంగా కోలాటం, తప్పెటగుళ్ల, డప్పులు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు, రాజేశ్, పట్టణ ప్రముఖులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి పండగ రాజకీయం తగదు : అయ్యన్న



విలేకరులతో మాట్లాడుతున్న అయ్యన్న

'మరిడి మహాలక్ష్మి పండగ జరగకపోతే ఊరికి అరిష్టమని, పండగను కూడా రాజకీయం చేస్తారా...' అని మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు అన్నారు. అయ్యన్నపద్మావతి దంపతులు సోమవారం మరిడి మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని పసుపు కుంకుమలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి పండగకు అంతా సహకరించాలని కోరారు. మరిడితల్లి పండగ అంటే ఊరందరి పండగ అని పేర్కొన్నారు. దేశ విదేశాలలో ఉన్నవారు సైతం పండగకి నర్సీపట్నం వస్తుంటారన్నారు. అమ్మ వారి పండగ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే ప్రజలే ముందు వచ్చి పండగ చేస్తారన్నారు.

నామినేషన్ల దాఖలుకు ముహూర్తాలు!

... 5వ పేజీ తరువాయి

ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలు నాయుడు కూడా అదే రోజున (24వ తేదీ) నామినేషన్ వేసేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్టు సమాచారం. నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈ నెల 19న, ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ 18న, వైసీపీ అభ్యర్థి రమణమూర్తిరాజు 19న నామినేషన్‌లు వేయనున్నారు. పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత 21వ తేదీన నామినేషన్ వేసి, 23న భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నామినేషన్ల స్వీకరణకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు వుంది.

బస్సెక్కితే బాదుడే

... 5వ పేజీ తరువాయి

వ్యక్తం చేస్తున్నారు. కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, స్వయంసహాయక వృత్తుల్లో ఉన్న వారంతా అద్దెలు తక్కువగా ఉంటాయనే భావనతో విశాఖ శివారు ప్రాంతాల్లో నివసిస్తారు. వారంతా పనుల కోసం విశాఖనగరానికి నిత్యం బస్సుల్లోనే వచ్చిపోతుంటారు. వచ్చే కూలీ/ వేతనంలో చార్జీలకే ఎక్కువ మొత్తం కేటాయించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) తక్కువగా ఉందనే కారణంతో పలు రూట్లలో బస్సులను రద్దుచేస్తున్నారని, దీని వల్ల ఆయా ప్రాంతాల వారికి ఆటోలే శరణ్యమవుతున్నాయంటున్నారు. ఆర్టీసీ చార్జీలను పెంచి ఆదాయం సమకూర్చుకోవాలనే వైసీపీ సర్కారు తీరును వారంతా తూర్పారబడుతున్నారు.

డిప్యూటీ సీఎంకు ఝలక్!

... 5వ పేజీ తరువాయి

చురుగ్గా పాల్గొనేలా డిప్యూటీ సీఎం ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆయన నుంచి స్పందన లేనట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కిలపర్తి భాస్కరరావు వ్యవహారంపై ఆదివారం రాత్రి మండలానికి చెందిన పార్టీ ముఖ్యనేతలతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించినట్టు సమాచారం. భాస్కరరావును బుజ్జగించే ప్రసక్తే లేదని, అతనికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ తనను మోసగించారంటూ డిప్యూటీ సీఎం వ్యాఖ్యలు చేసినట్టు చెబుతున్నారు. అతనితో తెగతెంపులు చేసుకున్నట్టు స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న కిలపర్తి భాస్కరరావు, తన భార్య రాజేశ్వరిని వెంటబెట్టుకుని సోమవారం మధ్యాహ్నం విశాఖపట్నం వెళ్లి జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడును కలిశారు. రాజేశ్వరి ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తూ, లేఖను ఆయనకు అందజేశారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. కాగా ఎంపీటీసీ పదవికి, వైసీపీకి రాజీనామా చేయలేదని భాస్కరరావు, రాజేశ్వరి చెప్పారు.

రక్తదాతలు కావలెను!

... 5వ పేజీ తరువాయి

రోగులకు రక్తం అందిస్తున్నారు. గత ఏడాది 908 మందికి రక్తం అందించగా ఈ ఏడాది జనవరిలో 106, ఫిబ్రవరిలో 100, మార్చిలో 84 మందికి రక్తం సరఫరా చేసి ప్రాణాలను కాపాడారు.

వేసవి, ఎన్నికల ఎఫెక్ట్

ఏటా ఏప్రిల్, మే నెలల్లో రక్తం కొరత ఏర్పడుతుంది. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోవడంతో దాతల కొరత నెలకొంటోంది. ఈ ఏడాది ఎన్నికల హడావిడి కావడంతో రాజకీయ నాయకులు బ్లడ్‌క్యాంప్‌లు ఏర్పాటు చేయడం లేదు. ఎన్నికల ప్రచారంలో ఉండిపోవడంతో సాధారణ రక్తదాతలు ముందుకు రావడం లేదు. దీంతో ఏరియా ఆస్పత్రిలోని కేంద్రంలో రక్త నిల్వలు తరిగిపోతున్నాయి. స్వచ్ఛంద సేవా సంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం కొరతను తీర్చాలని సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి దేవి కోరుతున్నారు.

పడకేసిన పనులు

... 5వ పేజీ తరువాయి

భరోసా కేంద్రాలకు భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రతి భవన నిర్మాణానికి రూ.21.8 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 213 భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఇంకా 149 భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రూ.53 కోట్ల మేర బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఇంతవరకు రూ.41 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. రూ.12 కోట్లు విడుదల కాకపోవడంతో ఈ ఏడాది జనవరి నుంచి పనులు నిలిచిపోయాయి.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు...

జిల్లాలో 297 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకుగాను 143 క్లినిక్‌ల భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మరో 154 భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.20.89 లక్షలు అంచనా వ్యయం అవుతుందని నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు రూ.32 కోట్ల మేర బిల్లులను సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. గత ఏడాది డిసెంబరు వరకు రూ.17 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.15 కోట్ల మేర బిల్లులు నిలిచిపోయాయి. నిధులు ఎప్పుడు విడుదల అవుతాయన్న దానిపై అధికారులకు కూడా స్పష్టత లేదు. పనులు పర్యవేక్షించిన సంబంధిత పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు ఎన్నికల విధుల్లో ఉండడంతో భవన నిర్మాణ పనుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాగా జిల్లాలో ప్రభుత్వ శాఖల భవన నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంపై పంచాయతీరాజ్ శాఖ ఈఈ వీరన్నాయుడును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఎన్నికల షెడ్యూల్ కారణంగా నిర్మాణ పనులు ఆగిన మాట వాస్తవమేనన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఎం.బుక్ ప్రకారం సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశామని చెప్పారు. ఒకింత ఆలస్యం అయినప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు జరుగుతాయని ఆయన తెలిపారు.

'మండే' సూరీడు

▸ ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే అగ్గి ▸ రోజు రోజుకు పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

▸ ఉక్కిరిబిక్కిరవుతున్న జనం ▸ మధ్యాహ్నం 12 గంటలకు చాలా చోట్ల రోడ్లు నిర్మానుష్యం

▸ ఇప్పుడే ఇలా ఉంటే.. మున్ముందు రోహిణి కార్తెలో పరిస్థితిపై పలువురు ఆందోళన



నిత్యం రద్దీగా ఉండే మాడుగుల ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు ఇదీ పరిస్థితి

మాడుగుల రూరల్/నర్సీపట్నం అర్బన్/రోలుగుంట, ఏప్రిల్ 15 : ఎండలు మండుతున్నాయి. ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు పైపైకి చేరుతున్నాయి. ఫలితంగా జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో ఉన్నా, వీధిలోకి వచ్చినా చెమటలు ఆగడం లేదు. ఇక ఉదయం



మధ్యాహ్నం 12 గంటలకు నిర్మానుష్యంగా ఉన్న నర్సీపట్నం మండలం చెట్టుపల్లి మెయిన్ రోడ్డు

పది గంటల నుంచి భానుడు ప్రతాపం చూపుతుండడంతో అంతా హడలిపోతున్నారు. ఒకవేళ బయటకు వచ్చిన వాహనాలపై వెళ్లేవారు హెల్మెట్ ధరిస్తున్నారు. పాదచారుల్లో మహిళలు తలపై చీరచెంగులు, పురుషులు తువ్వాళ్లు కప్పుకుని ఎండ నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నారు. మధ్యాహ్నం పన్నెండు గంటలైతే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇవే దృశ్యాలు సోమవారం మాడుగుల, నర్సీపట్నం, రోలుగుంట మండలాల్లో కనిపించాయి. శీతలపానీయాల వ్యాపారం ఎండల కారణంగా ఊపందుకుంది. ఇదిలావుంటే, ప్రతి ఏటా వేసవి కాలం ప్రారంభం నుంచే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చలివేంద్రాలను ఎక్కడికక్కడ ప్రారంభించేవారు ఎండల్లో వివిధ పనులపై తిరిగేవారు ఇక్కడ చల్లని నీరు, మజ్జిగ వంటి వాటితో గొంతుతడుపుకుని ఉపశమనం పొందేవారు. కానీ చాలా చోట్ల చలివేంద్రాలు ప్రారంభం కాలేదు.

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

▸ స్వచ్ఛంద, ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశంలో సీఎం రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

చోడవరం, ఏప్రిల్ 15 : వెనుకబడిన అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధే తన ముందున్న లక్ష్యమని అనకాపల్లి పార్లమెంట్ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ స్పష్టం చేశారు. పట్టణంలో సోమవారం ఏర్పాటైన స్వచ్ఛంద సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలైన చోడవరం, మాడుగుల వంటి ప్రాంతాల స్థితిగతులను చూస్తే చాలా వెనుకబాటుతనం కనిపిస్తున్నదన్నారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత కేంద్ర పెద్దలతో ఉన్న సాన్నిహిత్యంతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత చోడవరం అసెంబ్లీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ సీఎం రమేష్‌ను గెలిపించుకోవడం ద్వారా కేంద్ర నిధులతో గ్రామీణప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. మత్స్యకార సంఘాల నాయకుడు అర్జునదాస్ మాట్లాడుతూ మత్స్యకారులకు రూ.285 కోట్లు రాకుండా చేసిన వైసీపీ ఈ ఎన్నికల్లో అధికారంలోనికి రావడానికి వీలులేదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి, మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు డీఎస్ ప్రసాద్, దేముడు, మాజీ సర్పంచ్ దొమ్మేసి గిరి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మని దర్శించుకున్న ఎండోమెంట్ ఆర్‌డీడీ



దుర్గామల్లేశ్వరస్వామి గుడిలో ఆర్‌డీడీ తదితరులు

నర్సీపట్నం, ఏప్రిల్ 15 : దేవదాయ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ విజయరాజు, విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ సుజాత, జిల్లా దేవదాయ అధికారిణి సుధారాణి సోమవారం పట్టణంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి విచ్చేశారు. తొలుత అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రావికమతంలోని రామాలయంలో తలెత్తిన వివాదంపై విచారణ నిమిత్తం వెళుతూ మార్గ మధ్యలో నర్సీపట్నంలో ఆగి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యనిర్వాహక అధికారి గంగారావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట



గవరవీధిలో రాటోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల, ఏప్రిల్ 15 : శ్రీరామ నవమి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా పట్టణంలోని గవరవీధిలో గల సీతారామస్వామి ఆలయంలో సోమవారం ముహూర్తపు రాటను వేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బుధవారం సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వడ్డాదిలో వైసీపీకి బిగ్ షాక్

▸ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు అనుయాయులతో కలిసి జనసేనలో చేరిక



వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరిన వారితో పీవీఎస్ఎన్ రాజు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 15 : మండలంలోని వడ్డాదిలో వైసీపీకి సోమవారం బిగ్ షాక్ తగిలింది. సర్పంచ్, ఉప సర్పంచ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు తమ అనుయాయులతో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అనంతరం జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వడ్డాది పంచాయతీ సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, వార్డు మెంబరు అబోతి నూకరాజు, వడ్డాది పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, వీర్ల సురేష్, పొలిమేర కృష్ణ, కుబిరెడ్డి వెంకటరావు, దాడి పెదగోవింద తదితరులు వైసీపీని వీడి జనసేపార్టీలో చేరారు. వీరందరికీ రాజు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

'వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం కావాలి'



చోడవరంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

చోడవరం/ నాతవరం, ఏప్రిల్ 15 : ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం కావాలని ఆ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం చోడవరంలో ఏర్పాటైన పార్టీ కేడర్ సమావేశంలో మాట్లాడారు. విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, నాతవరంలో నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి గణేశ్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడులతో కలిసి సుబ్బారెడ్డి సోమవారం రాత్రి ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, అంకంరెడ్డి పార్వతి, కరక అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసులు వాహన తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సీపట్నం, ఏప్రిల్ 15 : పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు, ఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. పెదబొడ్డేపల్లి కూడలిలో విశాఖపట్నం, చోడవరం, కోటవురట్ల రూట్‌ల నుంచి నర్సీపట్నంలోకి వస్తున్న వాహనాలు, అలాగే, నర్సీపట్నం నుంచి ఆయా రూట్లలో వెళుతున్న వ్యాన్‌లు, కార్లు తదితరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, గంజాయి, మద్యం వంటివానికి అక్రమంగా తరలించకుండా ఉన్నతాధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు.

వైసీపీ నుంచి రాజమండ్రి ఎంపీగా పోటీకి ఆఫర్

▸ సమయం చాలనందున తిరస్కరించా : సినీ నటుడు సుమన్



విలేకరులతో మాట్లాడుతున్న నటుడు సుమన్

నర్సీపట్నం, ఏప్రిల్ 15 : రాజమండ్రి పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేయమని వైసీపీ నుంచి ఆఫర్ వచ్చిందని సినీ నటుడు సుమన్ తెలిపారు. నర్సీపట్నంలోని ప్రముఖ వ్యాపారి వెలగా నారాయణరావు ఇంటికి సోమవారం విచ్చేసి కాసేపు మాట్లాడారు. క్రీడలను ఇక్కడ ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారని తెలిసిందని, నర్సీపట్నంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ఏర్పాటు చేద్దామని అన్నారు. అనంతరం ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా పోటీకి వైసీపీ నుంచి ఆఫర్ వచ్చిందని, ఎన్నికలకు కేవలం మూడు నెలలు మాత్రమే ఉన్నందున చేయలేనని చెప్పేశానన్నారు.

'అయ్యన్నతోనే నియోజకవర్గం అభివృద్ధి'



మాధవనగరంలో మాట్లాడుతున్న విజయ్

నాతవరం, ఏప్రిల్ 15 : రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా కూటమి అభ్యర్థులకు ఓటర్లంతా పట్టం కట్టాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాధవనగరంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడకు వెళ్లినా టీడీపీ హయాంలో అయ్యన్నపాత్రుడు మంత్రి ఉన్న సమయంలో చేసిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. ఈ ప్రాంతం మళ్లీ అభివృద్ధి చెందాలంటే అయ్యన్నను గెలిపించాల్సిందిగా కోరారు. మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ, నాయకులు లాలం అచ్చిరాజు, నందిపల్లి వెంకటరమణ, మరిడేశ్వరరావు, జనసేన నాయకుడు సూర్యచంద్ర పాల్గొన్నారు.

ఎనిమిది వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

గొలుగొండ, ఏప్రిల్ 15 : పప్పుశెట్టిపాలెం గ్రామ శివార్లలో సారా బట్టీపై ఎస్ఐ కృష్ణారావు బృందం సోమవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి సంబంధించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

గురుకుల పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

దేవరాపల్లి, ఏప్రిల్ 15 : మండలంలోని తెనుగుపూడి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు సదరు విద్యాలయానికి క్రీడా సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ సిహెచ్.రవీంద్రనాథ్‌కు చినసోంపురం గ్రామానికి చెందిన కొరతం కృష్ణ, సూరిదేముడులు సుమారు ఆరు వేల రూపాయలు విలువ చేసే సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ అరుణ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి'



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ సత్యవాణి

మాడుగుల, ఏప్రిల్ 15 : ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీవోలు, ఏపీవోలకు సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ జీవీ సత్యవాణి మాట్లాడుతూ ఎన్నికలను పక్కాగా నిర్వహించాలన్నారు. ఈవీఎంలు ఏ విధంగా వినియోగించాలని, ఎన్నికల విధులు, సమయపాలన తదితరాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. రెండు రోజులపాటు రెండు బ్యాచ్‌ల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎన్నికల డీటీ ఎం.రాజు, ఈవోపీఆర్‌డీ మీనా కుమారి, ఆర్ఐ, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



శెట్టిపాలెంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం, ఏప్రిల్ 15 : మండలంలోని భీమబోయినపాలెం, శెట్టిపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో చంద్రరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు, ఫీల్డ్‌అసిస్టెంట్ల మస్తర్లను తనిఖీ చేశారు. పనిప్రదేశంలో తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే, కూలీలు ఎక్కడ పనులు చేస్తున్నా అక్కడ టెంట్లు వేయాలని ఆదేశించారు.

ఇలా ప్రారంభం.. అలా ముగింపు..!

▸ కోడ్ నేపథ్యంలో మొక్కుబడిగా చీడికాడ మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ, ఏప్రిల్ 15 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో చీడికాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఇలా ప్రారభమై.. అలా ముగిసింది. తొలుత సోమవారం మధ్యాహ్నం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోడ్ అమలులో ఉన్నందున సమావేశాన్ని త్వరగా ముగిస్తున్నట్టు చెప్పారు. మొత్తం 13మంది ఎంపీటీసీలకు గాను తొమ్మిది మంది మాత్రమే హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు కూడా విచ్చేశారు. సభ్యులతో సంతకాలు తీసుకున్న అనంతరం సమావేశాన్ని ముగిస్తున్నట్టు ఎంపీపీ ప్రకటించారు. జడ్పీటీసీ లాలం శారదా వరలక్ష్మి, వైస్ ఎంపీపీలు కిముడు చిన్నమ్మలు, ధర్మిశెట్టి స్వాతి, మండల పరిషత్ కార్యాలయ ఏవో ఎం.కామేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న వైద్య సిబ్బంది

రోలుగుంట, ఏప్రిల్ 15 : మండల కేంద్రం రోలుగుంటలో ఆవ వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది లక్ష్మి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఎండా కాలంలో పని ప్రదేశంలో కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.